క్లుప్తంగా

కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేత



చిలకలపూడి(మచిలీపట్నం): బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శాలివాహన సంక్షేమ, అభివృద్ధి సంస్థ జిల్లా కమిటీ సభ్యులుగా నియమింపబడిన వారు శాలివాహన సంక్షేమం కోసం కృషి చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. ఏపీ శాలివాహన సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎం. పురుషోత్తం సమక్షంలో సభ్యులుగా నియమింపబడిన నల్లూరి వెంకట రామ శివాజీ (మచిలీపట్నం), కానుల్ల కోటేశ్వరమ్మ (భూషణగుళ్ల, పెదపారుపూడి మండలం)కు కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శాలివాహనులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ. 25 వేలు విరాళం



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు మణికంఠ రెడ్డి రూ.25 వేలు విరాళంగా ఆలయ అధికారులకు బుధవారం ఉదయం స్వామివార్లను దర్శించుకున్న ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రసాద్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థినికి అభినందన



మచిలీపట్నంటౌన్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని బందరుకోట మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు టీవీ రఘుకాంత్ అన్నారు. బందరుకోట మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించిన బొమ్మిడి నాగజ్ఞాన ఐశ్వర్యను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీ రఘుకాంత్, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. రఘుకాంత్ మాట్లాడుతూ ఐశ్వర్య 2019–20లో ఇక్కడ పదో తరగతి చదివి అనంతరం పద్మావతి మహిళా కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి శ్రీకాకుళం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



మచిలీపట్నంటౌన్: 11వ డివిజన్‌కు చెందిన జొన్నల ఎలియరాజు ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ. 10 వేలను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గూడవల్లి నాగరాజు అందజేశారు. బందరు మండలం కానూరు వెళ్లి ఎలియరాజు కుటుంబ సభ్యులకు ఈ మొత్తాన్ని అందజేశారు. డివిజన్ వెల్ఫేర్ సెక్రటరీ రత్నకుమారి, వైఎస్సార్ సీపీ నాయకుడు ఏడుకొండలు, మురళి, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



కోనేరుసెంటర్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి జి. జ్ఞానమణి అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ కళాశాలలోకి కొత్తగా ప్రవేశించిన విద్యార్థులకు కళాశాలకు సంబంధించిన విధివిధానాలు తెలియజేయడంతో పాటు విద్యార్థుల్లో స్ఫూర్తి, ధైర్యాన్ని నింపేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. రిజిస్ట్రార్ పి. వీరబ్రహ్మాచారి, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. విజయకుమారి మాట్లాడారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం. కోటేశ్వరరావు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సుందరకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ప్రజల ఆయుష్షు పెంపు

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్



చెన్నూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్

పెడన: పేద ప్రజల ఆరోగ్యం గురించి ఆలోచన చేస్తూ వివిధ పథకాల ద్వారా వైద్యాన్ని చేరువ చేసి ఆయుష్షును పెంచుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మీరంతా మళ్లీ ఆశీర్వదించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం బుధవారం మండల పరిధిలోని చెన్నూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించారు. శిబిరాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి గడప వద్దే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ జగనన్న మన ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. మన ఆయుష్షు పెంచుతూ అనేక సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని వివరించారు. ఆరోగ్య ఇబ్బందులున్నవారు పెద్ద ఆస్పత్రుల వరకు వెళ్లే అవసరం లేకుండా స్పెషలిస్ట్ డాక్టర్లతో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు మనకు అందుబాటులోనే ఏర్పాటుచేసి ఉచితంగా పరీక్షలు చేయిస్తున్నారని చెప్పారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయించేందుకు పెద్దాసుపత్రులకు సిఫార్సు చేయడంతో పాటు మందులు ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు మరలా ఆస్పత్రులకు వెళ్లకపోవడాన్ని జగనన్న గమనించి అలాంటి వారికి ఈ శిబిరాల్లో ఉచితంగా మందులు అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. 631 మంది ఓపీలో నమోదు చేయించుకోగా వీరిలో ముగ్గురిని కార్డియాలజీకి, మరో ముగ్గురిని ఇతర శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ గీతాబాయి, ఎంపీపీ వాణి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చారుమతి, నాయకులు పాల్గొన్నారు. డాక్టర్లు సౌజన్య, విశాల్, పర్వేజ్ హైదర్, అనూషలతో పాటు ఏఎన్‌ఎంలు, వలంటీర్లు, ఆశావర్కర్లు సేవలను అందజేశారు.

గణపేశ్వరంలో..

గణపేశ్వరం(నాగాయలంక): గణపేశ్వరం సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష శిబిరం ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. 711 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పేదలకు, గుర్తించిన రోగులకు, సీనియర్ సిటిజన్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మండలంలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ శివరామకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కోకనారాయణపాలెంలో..

గూడూరు: గూడూరు మండలం కోకనారాయణపాలెంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్, సర్పంచి బండి అంజలి కుమారి, తహసీల్దార్ బి.విజయప్రసాద్, సచివాలయ కన్వీనర్ కనపర్తి రాజు, మల్లవోలు పీహెచ్‌సీ వైద్యాధికారి టి.మాధురి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తర చిరువోలులంకలో..

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): మండల పరిధి ఉత్తర చిరువోలులంక ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 412 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ చింతా శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ రెడ్రౌతు వెంకట రమణ, రెడ్రౌతు రాంప్రసాద్, గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రావణి, జనరల్ వైద్యులు డాక్టర్ రాఘవ, కంటి వైద్య నిపుణులు డాక్టర్ అనూష, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎల్. లక్ష్మీనాథ్, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ హారిక, డాక్టర్ శ్రీరామ్, సచివాలయ ఉద్యోగులు, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరావు, వీఆర్వో ప్రశాంత్, సురేంద్ర, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో..

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని ఒకటో సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ శైలజకుమారి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో–ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, ఎంపీటీసీ గోళ్ల కృష్ణకుమారి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

- కృత్తివెన్ను: మండల పరిధి నీలిపూడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ శిబిరానికి హాజరై వైద్య పరీక్షల తీరును పరిశీలించి రోగులతో మాట్లాడారు. శిబిరంలో పాల్గొన్న రోగలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, మండల కన్వీనర్ వెంకట్రాజు, సర్పంచ్ పాశం కృష్ణ, ఎంపీటీసీ పాశం సుజాత తదితరులు పాల్గొన్నారు.
- బంటుమిల్లి: మండల పరిధిలోని కంచడం గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీపీ వెలివెల చినబాబు మంత్రి జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్‌తో కలిసి ప్రారంభించారు. 562 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సర్పంచ్ బండారు చంద్రశేఖర్, బంటుమిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కె. పవన్‌కుమార్, వైద్యులు రంగనాథ్, సురేఖ, పీహెచ్‌సీ వైద్యులు సీహెచ్. సౌందర్య, కె. సువర్చల, వి. జయశ్రీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



చల్లపల్లి శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



నీలిపూడిలో మాట్లాడుతున్న జోగి రాజీవ్

మేకవానిపాలెంలో..

కోనేరుసెంటర్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. మేకవానిపాలెంలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని కిట్టు సందర్శించి రోగులతో మాట్లాడారు. శిబిరంలో పాల్గొన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, ఎంపీడీఓ బాలకృష్ణ, వైద్య సిబ్బంది, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తోట సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మేకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యం అధునాతనం..

చల్లపల్లి: రాష్ట్రంలో పేద ప్రజల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్యశాలల్లో అధునాతన వైద్య పరికరాలు సమకూర్చారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయం–3 పరిధిలోని ఎస్టీ కాలనీ రవీంద్ర భారతి ఎంపీపీ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు వైద్య పరీక్షలు, చికిత్స అందిస్తున్న తీరును పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సంపూర్ణ వైద్యసేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వివరించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రీజనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, నియోజకవర్గ ఈఆర్వో వి. పార్వతి, ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమంతో గ్రామాల్లో నవోదయం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



లబ్ధిదారుకు బ్రోచర్ అందజేసి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

రేమాలవారిపాలెం (నాగాయలంక): సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ సెంటర్లు, ఫ్యామిలీ డాక్టర్ వంటి పలు వ్యవస్థలను పేద ప్రజల ముంగిటకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చి నవరత్నాల సంక్షేమంతో గ్రామాల్లో నవోదయం వెల్లివిరిసేలా చేశారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రేమాలవారిపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించారు. గ్రామంలోని 493 గృహాలను ఎమ్మెల్యే సందర్శించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావు, మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకట నారాయణ(చిన్నారి), సర్పంచి చోడిశెట్టి బుజ్జమ్మ, ఎంపీటీసీ పుట్టి స్వరూపరాణి, చోడిశెట్టి మాణిక్యాలరావు, బీసాబత్తుని ప్రసాద్, నంద్యాల కోటేశ్వరరావు, బర్రంకుల పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పంచరత్నాలు పద్య నాటకం



బాలనాగమ్మలో మాయల పకీరు, సంగు పాత్రలలో ఆకట్టుకున్న కొల్లాటి శివాజీ, కె.రత్నశ్రీ

నాగాయలంక: నాగాయలంక ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో వార్షిక వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి పంచరత్నాలు పౌరాణిక, జానపద నాటకాల్లోని ముఖ్య ఘట్టాలను కళాకారులు ప్రదర్శించారు. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన నటీమణి కె.రత్నశ్రీ భక్త చింతామణి, సంగు పాత్ర ధారణలో చక్కటి అభినయం, రసమయమైన నృత్యాలతో ఆకట్టుకున్నారు. గయోపాఖ్యానంలోని వార్ సీన్, భక్త చింతామణిలో భవానీ శంకరం సీన్, బాలనాగమ్మలో మాయల పకీరు సీన్, సత్యహరిశ్చంద్రలో వారణాశి, కాటి సీన్‌లను వివిధ ప్రాంతాల రంగ స్థల నటులతో పాటు సార్లగొందికి చెందిన నటులు అద్భుతంగా ప్రదర్శించారు. కృష్ణుడిగా నల్లబోయిన నాగరాజు(ఆగిరిపల్లి), అర్జునుడిగా పల్లగాని ఫణికుమార్ (విజయవాడ) హార్మోనియం సహకారం సత్తిబాబు (రాజమండ్రి), సజ్జా సత్యనారాయణ (విజయవాడ) అందించారు. పద్యాలు ఆద్యంతం అలరించడంతో ప్రదర్శనలు తెల్లవారుజాము 3.30 గంటల వరకు సాగాయి. ఉత్సవ కమిటీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, శ్రీరామ పాదక్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, చిట్టా నారాయణరావు, గడ్డిపాటి ప్రసాద్, తలశిల నరసింహారావు(తాతయ్య) పర్యవేక్షించారు.

విజయవాడ ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత



మచిలీపట్నంటౌన్: ఎనిమిదో డివిజన్‌కు చెందిన తుమ్మల సంతోష్‌కుమార్ విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. డివిజన్ కార్పొరేటర్ శ్రీరాం లక్ష్మణకుమార్ (చిన్నా) చొరవతో వలంటీర్ రాజకుమారి విజయవాడ ఆస్పత్రికి వెళ్లి సంతోష్‌కుమార్‌కు పింఛను సొమ్ము రూ. 10వేలను అందజేసింది. ఆస్పత్రికి వచ్చి పింఛను సొమ్ము అందించడంపై సంతోష్ కుమార్ ఆనందం వ్యక్తం చేశారు.

మచిలీపట్నంలో 98.38 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో నాలుగో రోజైన బుధవారం వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ 98.38 శాతం పూర్తి చేశారు. పింఛన్ల పంపిణీలో జిల్లాలో మచిలీపట్నం నగరం నాలుగో స్థానంలో నిలిచింది. ఇంకా 309 మందికి పింఛన్లు పంపిణీ చేస్తే నూరు శాతం పూర్తవుతుంది.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కోడూరు: తపాలా శాఖ అందిస్తున్న వివిధ పథకాలు, సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ అన్నారు. పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రధాన సెంటర్‌లో 'జనంలోకి మనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తపాల శాఖ పథకాలను వివరించారు. అనంతరం శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అవనిగడ్డ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ టి.నాగరాజు, పీఎల్‌ఐ డీఓ రంగబాబు, పోస్టుమాస్టర్ బి.హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



బంటుమిల్లి: గత ఏడాది నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలో ప్రతిభ చూపిన కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ) నుంచి ప్రశంసాపత్రాలు అందాయి. 'విద్యారంగంలో మార్పులు, భవిష్యత్‌లో పోటీ కోసం ప్రపంచ విద్యారంగంలో చేపట్టాల్సిన పలు అంశాలపై విద్యార్థులు ఆన్‌లైన్‌లో పీఎంఓ కార్యాలయానికి రాతపూర్వకంగా పంపారు. వారు పంపిన పలు అంశాలను అభినందిస్తూ పీఎంఓ నుంచి ప్రశంసాపత్రాలు అందాయి.

ఏపీలో సంక్షేమం దేశానికే ఆదర్శం

మంత్రి జోగి రమేష్



వృద్ధురాలికి బ్రోచర్ అందజేసి మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం పెడన మండలం చేవెంద్ర గ్రామంలో నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద వారు పొందిన లబ్ధిని వివరిస్తూ బ్రోచర్లను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ నిరుపేదల కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రేమతో ఎంతో మంచి చేస్తున్న జగనన్నకు మీ ఆశీస్సులు అందించాలని కోరారు. అవ్వాతాతలకు ఇంటి వద్దకే పింఛన్లు, విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, మహిళలకు చేయూత, జగనన్న తోడు వంటి ఎన్నో పథకాల సొమ్మును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారని, ఇవన్నీ ఎవరు ఇస్తున్నారంటూ మంత్రి ప్రశ్నించగా.. జగనన్నే ఇస్తున్నారని ప్రజలు బదులిచ్చారు. మీకు ఎంతో మంచి చేస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. చేవేంద్ర గ్రామ సచివాలయం పరిధిలో 365 మందికి ప్రతి నెలా ఒకటో తేదీన రూ.9.52 లక్షలు పింఛన్ల రూపంలో అందిస్తున్నారని చెప్పారు. గ్రామంలో 560 మందికి రైతు భరోసా, 90 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ చేయూత, 79 మందికి కాపు నేస్తం, 160 మందికి అమ్మఒడి, 56 గ్రూపులకు వైఎస్సార్ ఆసరా, 74 మందికి విద్యా దీవెన, 60 మందికి వసతి దీవెన పథకాల కింద లబ్ధి చేకూర్చినట్లు మంత్రి వివరించారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద 48 మందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారని తెలిపారు. గ్రామంలో డ్రెయినేజీ, సైడ్ కాలువలు నిర్మించాలని పలువురు గ్రామస్తులు మంత్రిని కోరారు. గ్రామంలో డ్రెయినేజీల నిర్మాణానికి అవసరమైన అంచనాలు రూపొందించాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.

గ్రామంలో చెరువు నీరు బాగోలేదని గ్రామస్తులు ఫిర్యాదు చేయగా, ఫిల్టర్ బెడ్లు మరమ్మతులు చేయించి సురక్షిత మంచినీరు అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. చేవేంద్ర పంచాయతీ పరిధిలో చేవేంద్రపాలెం, మద్రిగుంట, కొండాయపాలెం గ్రామాలకు జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిలు అందించేందుకు రూ.1.32 కోట్లు మంజూరయ్యాయని, టెండర్లు పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో పెడన ఏఎంసీ చైర్‌పర్సన్ చారుమతి, పెడన ఎంపీపీ వాణి, సర్పంచ్ భాస్కరరావు, పెనుమల్లి సర్పంచ్ రామానాయుడు, ఎంపీటీసీ గిరిబాబు, స్థానిక నాయకులు, మండల అధికారులు పాల్గొన్నారు.

10 వేల మందికి అన్నసమారాధన



నాగాయలంక: స్థానిక ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో 17 రోజుల పాటు నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా బుధవారం రాత్రి నాగాయలంకలో 10 వేల మందికి అన్నసమారాధన జరిగింది. అర్చకుడు ఘంటసాల పవన్ కుమార్ శర్మ, కమిటీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీరామ పాదక్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, చిట్టా సాంబశివరావు, తాడికొండ సత్యనారాయణ, తలశిల నరసింహారావు (తాతయ్య), రాచంశెట్టి పాపారావు, విస్సంశెట్టి రాము, గడ్డిపాటి ప్రసాద్, ప్రముఖులు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టండి

- మేయర్ వెంకటేశ్వరమ్మ
- 16వ డివిజన్‌లో పర్యటన



16వ డివిజన్‌లో మహిళ సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: 16వ డివిజన్‌లో వ్యర్థాలతో నిండిన డ్రెయిన్లలో పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అధికారులను ఆదేశించారు. డివిజన్‌లో బుధవారం ఉదయం ఆమె పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందని స్థానికులు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రాంతంలో హోటల్స్ ఎక్కువగా ఉండటంతో వారు వ్యర్థాలను డ్రెయిన్లలో వేస్తుండటంతో సిల్టు పేరుకుపోయి వర్షం వచ్చినప్పుడు డ్రెయిన్లు పొంగుతున్నాయన్నారు. డ్రెయిన్లలో వ్యర్థాలు వేస్తున్న హోటళ్ల యజమానులకు నోటీసులు ఇవ్వాలని, డ్రెయిన్లలో వ్యర్థాలను త్వరితగతిన తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఐదు రోడ్ల సెంటర్‌లో స్పీడ్ బ్రేకర్ వేయించాలని ఆ ప్రాంత మహిళలు మేయర్‌ను కోరారు. తాగునీటి సరఫరా ఎలా ఉందని మహిళలను ఆమె అడిగి తెలుసుకోగా తాగునీరు సక్రమంగా అందుతోందని వారు బదులిచ్చారు.18వ డివిజన్ సచివాలయాన్ని మేయర్ వెంకటేశ్వరమ్మ ఆకస్మికంగా సందర్శించి ఉద్యోగుల హాజరు పట్టీలను, రికార్డులను పరిశీలించారు. పన్ను వసూళ్లు పూర్తిస్థాయిలో జరిగేలా చూడాలన్నారు.

చిలకలపూడి పాండురంగ మునిసిపల్ హైస్కూల్‌ను మేయర్ పరిశీలించారు. గురువారం నిర్వహించనున్న సురక్ష శిబిరం ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమాల్లో మాజీ కౌన్సిలర్ భోగిరెడ్డి బేబి, కార్పొరేటర్ మేకల సుబ్బన్న, ఫకీర్, అజీజ్, కార్పొరేటర్ రామిశెట్టి వాణిశ్రీ, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులోకి దూసుకుపోయిన లారీ



కృత్తివెన్ను: రొయ్యల మేత లోడుతో వెళుతున్న లారీ యండపల్లి వద్ద 216 జాతీయ రహదారి పక్కనున్న చెరువులోకి దూసుకుపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నుండి నెల్లూరుకు రొయ్యల మేతతో లారీ బయలుదేరింది. బుధవారం తెల్లవారుజామున యండపల్లి వద్దకు రాగానే అదుపు తప్పి రోడ్డు మార్జిన్ నుంచి చెరువు వైపునకు దూసుకుపోయింది. లారీలో డ్రైవర్‌తో పాటు, క్లీనర్ ఉండగా ఎవ్వరికీ ఎటువంటి ప్రాణహానీ జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

రేపు బంటుమిల్లిలో మెగా జాబ్‌మేళా

బంటుమిల్లి: ఏపీఎస్ఎస్‌డీసీ, జిల్లా ఉపాధి కల్పన శాఖల ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా కార్యక్రమం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఈనెల 6వ తేదీన నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవరపల్లి విక్టర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్. శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో 11 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని వారికి కావలసిన సిబ్బందిని ఎంపిక చేసుకుంటారన్నారు. పదో తరగతి నుంచి పీజీ తోపాటు పలు ఉపాధి, డిప్లొమో, టెక్నికల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు అర్హత ధ్రువీకరణ పత్రాలతో మేళాలో పాల్గొనాలని కోరారు.